సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 27 । ఆగస్టు । 2025

గరిష్ఠం / కనిష్ఠం
28° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.



గణపతి పూజకు వేళాయె..

వినాయక చవితి వేడుకలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కమిటీల సభ్యులు సర్వం సిద్ధం చేశారు. దీంతో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

11లో

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



శ్రీరామకోటి ప్రతులకు పూజలు చేస్తున్న దృశ్యం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీరామకోటి ప్రతుల నిమజ్జనం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన శ్రీరామకోటి ప్రతులను ఈఓ ఎల్.రమాదేవి ఆధ్వర్యాన మంగళవారం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. అనంతరం గౌతమీ నదికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారే చీరె సమర్పించి, వైభవంగా నదీ హారతి ఇచ్చారు.

రామాలయ ఈఓగా దామోదర్ రావు



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా దామోదర్ రావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఈఓ రమాదేవిని పదోన్నతిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావుకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి దేవాదాయ శాఖకు పంపించారు. తాజాగా ఆయనకు ఆలయ ఈఓ బాధ్యతలు అప్పగించడంతో రమాదేవి ఆర్అండ్‌బీ శాఖకు వెళ్లనున్నారు. దేవస్థాన మాఢ వీధుల విస్తరణకు భూసేకరణ, నష్ట పరిహారం పంపిణీలో దామోదర్ రావు కీలకంగా వ్యవహరించారు.

వైద్యులపై ఎమ్మెల్యే ఆగ్రహం



కొత్తగూడెంఅర్బన్: వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి వైద్యులపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆస్పత్రి ప్రాంగణాన్ని తనిఖీ చేసిన ఆయన పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి మండిపడ్డారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. చిన్న కేసులను కూడా ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, జిల్లా ఆస్పత్రికి వచ్చే వారిని ఇతర ఆస్పత్రులకు ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. సేవా దృక్పథంతో పనిచేయాలని, మొక్కుబడి ఉద్యోగాలు చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు.

మట్టి విగ్రహాలనే వాడుదాం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): మట్టి విగ్రహాలతో వినాయక చవితి జరుపుకుందామని ఎమ్మెల్యే కూనంనేని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఓపీతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించొద్దని, కాలుష్య నివారణ కోసం మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సుజాత, అధికారులు అహ్మద్, వీరభద్రాచారి, రంగప్రసాద్ పాల్గొన్నారు.



ఎరువు.. బరువాయె!

యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు
- ఇదే అదనుగా రెచ్చిపోతున్న కొందరు వ్యాపారులు
- యూరియాకు కాంప్లెక్స్ ఎరువులు అంటగడుతున్న వైనం
- అదనపు కొనుగోళ్లతో పెరుగుతున్న పెట్టుబడి వ్యయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎరువుల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆసరా చేసుకుని ఖజానా నింపుకునే పనిలో కొందరు వ్యాపారులు ఉన్నారు. బస్తా యూరియా కావాలంటే అదనంగా కాంప్లెక్స్, పొటాష్, డీఏపీ వంటి ఎరువులను అంటగడుతున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం అనూహ్యంగా పెరుగుతోంది.

యూరియానే కీలకం..

జిల్లాలో పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న పంటలు అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పంటలన్నీ సక్రమంగా ఎదిగి రైతులకు లాభసాటిగా ఉండాలంటే ఎరువుల వాడకం తప్పనిసరి. సాగులో ఉపయోగించే ఎరువుల్లో డీఏపీ (డై అమ్మోనియం ఫాస్ఫేట్), మ్యూరేట్ ఆఫ్ పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌లతో పాటు మొక్కల ఎదుగుదలకు కీలకమైన పోషకాలు (ఎన్‌పీకే, నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం) వేర్వేరు మోతాదుల్లో ఉండే కాంప్లెక్స్ ఎరువులు మొదటి నుంచి చివరి వరకు వినియోగించాల్సి ఉంటుంది. అయితే ఈ ఎరువులను ఉపయోగించే ప్రతీ దశలో అంతే మొత్తంలో యూరియాను రైతులు వినియోగిస్తున్నారు. ఎకరం వరి సాగుకు దుక్కిలో, నాటు వేసిన 15 రోజుల తర్వాత 50 కేజీల డీఏపీ 50 కేజీల యూరియాతో కలిపి చల్లుతారు. ఆ తర్వాత 15 రోజులకు 50 కేజీల కాంప్లెక్స్(ఎన్‌పీకే) ఎరువుతో 45 కేజీల యూరియా కలిపి వేస్తారు. పొట్ట దశలో పొటాష్, యూరియా కలిపి అందిస్తారు. మొత్తంగా పంట ఎదుగుదల కోసం 100 కేజీల వేర్వేరు ఎరువులు అందిస్తే.. దాదాపు అదే స్థాయిలో యూరియా కూడా వేయాల్సి ఉంటుంది. యూరియా బస్తాలో సుమారు 46 శాతం మేర నత్రజని ఉంటుంది. మొక్క వేగంగా, పచ్చగా ఎదగడంలో నత్రజనిది కీలక పాత్ర. దీంతో సాగులో యూరియా అత్యంత కీలకంగా మారింది.

పెరుగుతున్న పెట్టుబడి..

మొక్క ఎదుగుదలను బట్టి క్రమం తప్పకుండా నిర్ణీత కాలంలో యూరియా, ఇతర ఎరువులు వేయాల్సి ఉంటుంది. అయితే ఫెర్టిలైజర్స్ షాపుల్లో యూరియా బస్తాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఇతర అనుబంధ ఎరువులు తప్పనిసరిగా కొనాల్సి వస్తోంది. కొన్ని చోట్ల ఇది నిర్బంధంగా అమలవుతుండగా మరికొన్ని చోట్ల కాంప్లెక్స్ ఎరువుల్లో కూడా నత్రజని కొంత మోతాదులో ఉంటుందంటూ యూరియాకు బదులు ఆ ఎరువులు వేయాలంటూ సలహాలు ఇస్తూ రైతులకు అంటగడుతున్నారు. తక్కువ ధరకు లభించే యూరియా బదులు ఎక్కువ ధర వెచ్చించి కాంప్లెక్స్ ఎరువులు అధికంగా కొనాల్సి రావడంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అంతేకాదు.. యూరియాలో నత్రజని 46 శాతం ఉంటుండగా.. కాంప్లెక్స్ ఎరువుల్లో 10 నుంచి 28 శాతం వరకే ఉంటుంది. పంటకు కావాల్సినంత నత్రజని కాంప్లెక్స్ ఎరువుల్లో లేకపోయినా ప్రస్తుతం యూరియా కొరతతో రైతులు అధిక ధరలకు ఆ ఎరువులు కొని వినియోగిస్తున్నారు. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని కొందరు ఫెర్టిలైజర్స్ షాపు నిర్వాహకులు కొనసాగిస్తున్న దందా కారణంగా పెట్టుబడి వ్యయం అనూహ్యంగా పెరుగుతోంది.

ఆ ఎరువులు.. అధిక నిల్వలు

సాగులో కీలకమైన యూరియాను రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాలు, ఫెర్టిలైజర్స్ షాపుల ద్వారా అందిస్తోంది. పీఏసీఎస్‌ల్లో ప్రధానంగా యూరియానే అమ్ముతుండగా డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు నామమాత్రంగా విక్రయిస్తున్నారు. అదే ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు కూడా భారీ స్థాయిలో అమ్ముతున్నారు. ప్రస్తుతం ఉన్న స్టాకు వివరాలను పరిశీలిస్తే యూరియా నిల్వల కంటే ఇతర ఎరువులు నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయి. సాగులో కీలకమైన యూరియాపై కేంద్ర ప్రభుత్వం భారీ రాయితీ అందిస్తోంది. 45 కేజీల బస్తా ధర రూ.1,770 ఉండగా ప్రభుత్వం అందించే సబ్సిడీ కారణంగా రూ.266కే రైతులకు లభిస్తోంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు ఇంత మొత్తంలో రాయితీలు లేవు. దీంతో వీటి ధర 50 కేజీల బస్తా సగటున రూ.1200కు పైగానే ఉంటోంది. తద్వారా యూరియాతో పోల్చితే అనుబంధ ఎరువుల అమ్మకాలు తక్కువ. అయితే ప్రస్తుతం నెలకొన్న యూరియా కటకటను అవకాశంగా మలచుకుని పలువురు వ్యాపారులు ఇతర ఎరువులు కొంటేనే యూరియా విక్రయిస్తామంటూ లింక్ పెడుతున్నారు.

పర్యావరణ హితమే లక్ష్యం



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న 'సాక్షి' మీడియా గ్రూప్, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు

- మట్టి విగ్రహాల వినియోగంతోనే ఇది సాధ్యం
- మట్టి ప్రతిమల పంపిణీలో వక్తలు
- 'సాక్షి', స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యాన పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా 'సాక్షి' మీడియా గ్రూప్, స్తంభాద్రి ఉత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఖమ్మం పెవిలియన్ మైదానం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విగ్రహాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు గెంటేల విద్యాసాగర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లిక అంజయ్య మాట్లాడారు. అందరికీ ప్రీతిపాత్రమైన వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకునేలా మట్టి ప్రతిమలు ప్రతిష్ఠించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల నిమజ్జనంతో నీరు కాలుష్యం కావడమే కాక జలరాశుల మనుగడ దెబ్బతింటుందన్నారు. ఏటా మండపాలు పెరుగుతున్నందున మట్టి విగ్రహాలతో ఉత్సవాలు జరుపుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి బాధ్యులు మూలగుండ్ల శ్రీహరి, నూకల మోహన్ కృష్ణ, జమ్మి శ్రవణ్‌కుమార్, బోయినపల్లి కోటిరెడ్డితో పాటు 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ జి.మోహన్‌కృష్ణ, సాక్షి టీవీ ప్రతినిధి పసునూరి మహేందర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజుతో పాటు జి.జవహర్‌రెడ్డి, జె.ఉపేందర్, సతీష్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. వైద్యాధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుమూల గిరిజన గ్రామాల్లోనూ వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని, అవసరమైతే వైద్య శిబిరాలు నిర్వహించి అదుపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలని చెప్పారు. సమావేశంలో వైద్యాధికారులు సైదులు, చైతన్య, స్పందన, విజయ్‌కుమార్, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువకులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు పీఓ తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జీ నంబర్ కలిగిన నిరుద్యోగ యువత జిరాక్స్ సర్టిఫికెట్లతో ఐటీడీఏలోని భవిత విభాగంలో సెప్టెంబర్ 1వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వరంగల్‌లో ఇచ్చే శిక్షణ సమయాన ఉచిత వసతి ఉంటుందని తెలిపారు. వివరాలకు 63026 08905, 90638 89994 నంబర్లలో సంప్రదించాలని పీఓ సూచించారు.

డ్రోన్‌తో యూరియా పిచికారీ చేయాలి

రైతులకు డీఏఓ బాబూరావు సూచన



రైతులకు అవగాహన కల్పిస్తున్న బాబూరావు తదితరులు

టేకులపల్లి : ద్రవరూపంలో ఉండే నానో యూరియాను డ్రోన్ల ద్వారా పిచికారీ చేయడం మేలని, ఎకరాకు 500 ఎంఎల్ వాడడంతో ఖర్చు కూడా తగ్గుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు, ఆత్మ డీపీడీ బి.సరిత రైతులకు సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై టేకులపల్లిలో మంగళవారం వారు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నానో యూరియాతో పంటల దిగుబడి పెరుగుతుందని, తక్కువ మోతాదులో వాడినా ఫలితం ఉంటుందని, పర్యావరణానికి మేలు చేస్తుందని, ఖర్చు తగ్గడంతో పాటు పంట నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు. నానో యూరియా కణాలు చాలా చిన్నవిగా ఉండడంతో మొక్కల కణజాలంలోకి తేలికగా ప్రవేశించి, నత్రజనిని సమర్థవంతంగా అందిస్తాయని, మొక్కలకు అవసరమైన పోషకాలు సకాలంలో అందడంతో దిగుబడి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్, ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓ శ్రావణి పాల్గొన్నారు.

30న సీఎం పర్యటన ఖరారు

ఎమ్మెల్యే ఆదినారాయణ వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడులో ఈనెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారైందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను సీఎం ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ మేరకు హౌసింగ్ అధికారులతో కలిసి మంగళవారం ఆయన నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం చంద్రుగొండ, దామరచర్ల గ్రామాల్లో పర్యటించి హెలిప్యాడ్, సభాస్థలి పనులను తనిఖీ చేశారు. చంద్రుగొండలోని ఆశ్రమ బాలికల పాఠశాలలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాలికలకు సరిపడా గదులు లేవని మ్యాట్రిన్ సునీత చెప్పగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, పర్సా వెంకట్, బొర్రా సురేష్, ఫజల్ , ఎండీ ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఒక్క రూపాయీ రాలే !

- బుట్టదాఖలైన ఎన్నికల హామీలు
- నియోజకవర్గంలో 169 పనులకు ప్రకటించిన నిధులు రూ.14.50 కోట్లు
- భద్రాచలంలో సెంట్రల్ లైటింగ్‌కు రెండుసార్లు శంకుస్థాపన
- ఇంకా ప్రతిపాదన దశలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లు



2023లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాటి మంత్రి పువ్వాడ



గత జూలైలో శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గానికి ఎన్నికల వేళ ఇచ్చిన అభివృద్ధి పనుల హామీలు బుట్టదాఖలే అయ్యాయి. నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ పనులపై చిత్తశుద్ధి చూపకపోవడంతో రూపాయి కూడా విడుదల కాలేదు. బీఆర్ఎస్ హయాంలో నిధుల ప్రకటనలో కీలకంగా వ్యవహరించిన నేతలే నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఉన్నా పనులు ముందుకు సాగడం లేదు.

ఎప్పుడూ అదే నిర్లక్ష్యం..

రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచే భద్రాచలంలో అభివృద్ధి కుంటుపడింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ పార్టీ అనేక హామీలు గుప్పించింది. ఓట్లే లక్ష్యంగా అప్పటికప్పుడు రూ.కోట్ల విలువైన పనులు చేపడతామని ప్రకటించింది. భద్రాచలం నియోజకవర్గంలోని 169 పనులకు రూ.14.50 కోట్లు ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ ఫండ్ ద్వారా విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో పలు అభివృద్ధి పనుల వేగవంతానికి తగు చర్యలు తీసుకోవాలంటూ భద్రాద్రి, ములుగు జిల్లాల కలెక్టర్లను నాటి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు ఆదేశించారు.

ప్రభుత్వం మారినా నేతలు వారే..

గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే నాడు బీఆర్ఎస్‌లో కీలకంగా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం వెంకట్రావు నియోజకవర్గ అభివృద్ధి పేరిట కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పార్టీలు వేరైనా నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు వారే. అయినప్పటికీ ఎన్నికల హామీలు అమలు కావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చి కూడా రెండేళ్లు కావొస్తున్నా మాఢ వీధుల విస్తరణ, తూరుబాక వద్ద బ్రిడ్జి నిర్మాణానికి మినహా.. మరే అభివృద్ధి పనులకూ నిధులు విడుదల కాలేదు.

..అయినా అంధకారమే

భద్రాచలంలోని చర్ల రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులకు నాటి ప్రభుత్వం రూ.రెండు కోట్లు ప్రకటించగా.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 2023 సెప్టెంబర్ 9వ తేదీ ఉదయమే అప్పటి రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా పనులు ముందుకు సాగలేదు. ఈ ఏడాది జూలై 7న అవే పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి శంకుస్థాపన చేశారు. అయినా ఆ పనులు చేపట్టక అంధకారమే నెలకొంది. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఈ రెండు శిలాఫలకాలు దర్శనమిస్తున్నాయి. ఇంకా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో పాటు పలు పనులు కూడా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

నియోజకవర్గంలో చేయాల్సిన పనులు..
- భద్రాచలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.2 కోట్లు, ప్రధాన రహదారిపై కూనవరం – చర్ల రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌కు రూ.2 కోట్లు, కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి మరో రూ.2 కోట్లు ప్రకటించారు.
- దుమ్ముగూడెం మండలంలో రూ.1.50 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మించాల్సి ఉంది.
- చర్ల మండలంలో రూ.50 లక్షలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.కోటి విడుదల చేయాలి.
- వెంకటాపురం మండలం పాత్రాపురం వద్ద బల్లకట్టు వాగుపై రోడ్ కం బ్రిడ్జికి రూ.కోటి, సెంట్రల్ లైటింగ్‌కు రూ.కోటి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.50లక్షలు, రోడ్లు, ఇతర పనులకు మరో రూ.2.50కోట్లు ప్రకటించారు.
- వాజేడు మండలంలో రూ.1.50 కోట్లతో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది.



కిన్నెరసానికి భారీ వరద

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద పోటెత్తుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 400 క్యూసెక్కుల వరద నీరు రావడంతో మంగళవారానికి నీటిమట్టం 404.90 అడుగులకు చేరింది. దీంతో ఒక గేటు ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

– పాల్వంచరూరల్

పోటెత్తిన తాలిపేరు..

తాలిపేరుకు వరద ఉధృతి పెరిగింది. మంగళవారం ఉదయం 6 గంటలకు 5,985 క్యూసెక్కుల వరద రావడంతో మూడు గేట్లు ఎత్తి 5,985 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం నుంచి క్రమంగా వరద పెరుగుతుండగా రాత్రి 10.00 గంటల వరకు మొత్తం 12 గేట్లు ఎత్తి 92,700 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని దిగువకు విడుదల చేసినట్లు డీఈ తిరుపతి తెలిపారు.

– చర్ల



క్లుప్తంగా

హెచ్‌సీఏ టోర్నీలో భద్రాద్రి క్రికెటర్ ప్రతిభ


రిత్విక్

భద్రాచలంటౌన్: భద్రాచలానికి చెందిన క్రికెటర్ నక్కా రిత్విక్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యాన ఘట్‌కేసర్‌లో నిర్వహించిన వన్డే లీగ్ టోర్నీలో ప్రతిభ చాటాడు. చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఆయన 134 బంతుల్లో 16ఫోర్లు, ఒక సిక్స్‌తో 116 పరుగు లు సాధించాడు. భద్రాచలంలోని క్రాంతి విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న రిత్విక్‌ను పాఠశాల చైర్మన్ సోమరౌతు శ్రీనివాస్ అభినందించారు.

యూరియా అందించడంలో విఫలం

జూలూరుపాడు: రైతులకు సరిపడా యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడారు. యూరియా కొరత నివారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సహకార సంఘాల గోదాముల వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు బారులుదీరుతున్నారన్నారు. యూరియా బస్తాల కోసం రైతులు గంటల కొద్దీ పడిగాపులు కాస్తే ఒకటి, రెండు కట్టలు ఇస్తున్నారని పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత?

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి పాయింట్ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం రెండుకార్లలో ముగ్గురువ్యక్తులు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా కొత్తగూడెం సీసీఎస్ పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒకకార్లో గంజాయి తరలిస్తుండగా మరో కారు వీరికి ఎస్కార్ట్‌గా వస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన గంజాయి, కార్లను కొత్తగూడెం తరలించిన సీసీఎస్ పోలీసులు.. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రకటించాల్సి ఉంది.

33 గ్యాస్ సిలిండర్లు చోరీ

బూర్గంపాడు: సారపాకలోని శ్రీసాయి గ్యాస్ ఏజెన్సీ గోదాంలోని 33 గ్యాస్ సిలిండర్లు చోరీకి గురయ్యాయి. గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ గణేశ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మేడ ప్రసాద్ కేసు నమోదు చేశారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు గ్యాస్ గోదాంలో చొరబడి 33 నిండు గ్యాస్ సిలిండర్లను అపహరించారు. సోమవారం గ్యాస్ గోదాం తెరిచిన తరువాత గ్యాస్ సిలిండర్లు చోరీకి గురైనట్లు గుర్తించిన మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రసాద్ మంగళవారం కేసు నమోదు చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలు కండీషన్‌లో లేకపోవడం, అతి వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నళ్లు పాటించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, నియంత్రణకు పోలీస్, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలని, ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని రవాణా శాఖకు సూచించారు. రహదారుల కూడళ్లు, దాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన కల్పించాలి..

మారుమూల అటవీ ప్రాంతాల గిరిజనులకు పీఎం ధర్తీ ఆబాజాన్ జాతీయ గౌరవ ఉత్కర్ష అభియాన్ పథకంపై అవగాహన కల్పించాలని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఐటీడీఏ పీఓ బి.రాహుల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తదితరులతో కలిసి పథకం విజయవంతానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై సమావేశం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ పరిధిలో మారుమూల గ్రామాలు ఎక్కువగా ఉన్న 19 మండలాల పరిధిలోని 134 గ్రామాల్లో ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లాస్థాయి అధికారులకు హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహించారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఎంహెచ్ఓ జయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ బి.రవీందర్, గిరిజన సంక్షేమ ఈఈ చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ నాగేశ్వరరావు, విద్యుత్ ఎస్‌ఈ మహేందర్, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్డీఓ వెంకటరమణ, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎస్‌హెచ్ డీఈ శైలజ, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పోస్టర్లు ఆవిష్కరణ..

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతి విగ్రహాల వాల్ పోస్టర్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని కొత్తగూడెం, పాల్వంచలో రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రమంతా మట్టి గణపతి విగ్రహాలను కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పంపిణీ చేశారని తెలిపారు.

హత్యాయత్నం కేసులో నలుగురికి జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్/బూర్గంపాడు: పాత కక్ష (భూ వివాదం)లను దృష్టిలో ఉంచుకుని ఇద్దరిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నలుగురికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.కిరణ్‌కుమార్ తీర్పు చెప్పారు. బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన సోదరులు తాళ్లూరి జగదీశ్వరరావు, సర్వేశ్వరరావు ఇరవెండి గ్రామంలోని సర్వే నంబర్ 49లో మూడెకరాల భూమిని సాగుచేసుకుంటున్నారు. ఇరవెండికి చెందిన సున్నం ముత్తయ్య, సున్నం తులసమ్మ, సున్నం గోపాలకృష్ణ అలియాస్ గోపాల్ వీరితో పాటు ఆశ్వాపురం మండలం చింతిర్యాలకు చెందిన కొమరం అంజయ్య, సున్నం చెంచయ్య మరి కొందరితో కలిసి 2019, ఫిబ్రవరి 11న కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న గ్రామస్తులు భూక్యా బాలాజీ, భూక్య జక్రి, బాదావత్ బాలకృష్ణ, ధరావత్ సురేశ్ కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయపడిన జగదీశ్వరరావు, సర్వేశ్వరరావును కుటుంబ సభ్యులు బూర్గంపాడు ఆస్పత్రికి తరలించారు. అదేరోజు జగదీశ్వరరావు భార్య తాళ్లూరి భారతి పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని తన భర్త, మరిదిని హత్య చేసేందుకు దాడి చేశారంటూ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. జడ్జి 14 మంది సాక్షులను విచారించిన అనంతరం సున్నం ముత్తయ్య, సున్నం తులసమ్మ, సున్నం గోపాలకృష్ణ అలియాస్ గోపాల్, కొమరం అంజయ్యపై నేరం రుజువు కావడంతో నలుగురికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానాను విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో ఓ మైనర్ ఉండటంతో అతడిపై వేరుగా విచారణ కొనసాగుతోంది. మరో నిందితుడు సున్నం చెంచయ్య మరణించడంతో అతడిపై కేసును కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కె.రాజారావు వాదించగా.. నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, డ్యూటీ ఆఫీసర్ సురేశ్ సహకరించారు.

8 మంది మావోయిస్టుల లొంగుబాటు


మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి ఆకర్షితులవుతున్న మావోయిస్టులు.. ప్రశాంత జీవితం గడిపేందుకు లొంగిపోతున్నారని ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. మావోయిస్ట్ పార్టీకి చెందిన 8 మంది దళ సభ్యులు లొంగిపోయిన సందర్భంగా మంగళవారం తన చాంబర్‌లో ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయంగా ఒక్కొక్కరికీ రూ.25 వేలు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి 81 మంది మావోయిస్ట్ పార్టీలో పలు రాష్ట్రాల్లో సభ్యులుగా ఉన్నారన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలంపల్లికి చెందిన సౌత్ సబ్ జోనల్ సప్లయింగ్ ఏసీఎం స్థాయి వేటి సోందా, అదే జిల్లా గుంజిపర్తికి చెందిన పార్టీ మహిళా సభ్యురాలు ముచ్చాకి లక్ష్మి, గంగలూరుకు చెందిన మిలీసియా సభ్యులు ఓయం లక్ష్మణ్, పోడియం కోసా, మడవి నందు, కరం సోముడు, మడవి ఉర్రా లొంగిపోయిన వారిలో ఉన్నారని చెప్పారు. ఏడాది వివిధ హోదాల్లోని సుమారు 314 మంది మావోయిస్టులు లొంగిపోయారని, జిల్లా నుంచి ప్రస్తుతం ఐదుగురు మావోయిస్టులు పనిచేస్తున్నారని ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో 81, 141 బెటాలియన్ సభ్యులతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

తెల్లవాగు చెరువు తూము లీకేజీ

మరమ్మతులు చేపట్టిన ఇరిగేషన్ అధికారులు


ఎడమ కాల్వ గుండా నీళ్లు బయటకు పోతున్న దృశ్యం

ములకలపల్లి: మండలంలోని పూసుగూడెం శివారు తెల్లవాగు చెరువు ఎడమ తూము ఎడమ షట్టర్ లీకేజీ అవుతోంది. దీంతో 450 ఎకరాల ఆయకట్టు కలిగిన చెరువులోని నీళ్లు వృథాగా పోతున్నాయి. చెరువు నిండా నీరు ఉన్న నేపథ్యాన లీకేజీతో రెండు రోజులుగా కాల్వ గుండా దిగువకు ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఇరిగేషన్ అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ గఫూర్‌పాషాను వివరణ కోరగా చెరువు నిండా నీళ్లు ఉండడంతో సమస్యను గుర్తించడం కష్టంగా మారినా తాత్కాలిక మరమ్మతు చేసినట్లు తెలిపారు. కాగా, తూము లీకేజీ మరమ్మతులు సత్వరమే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం పనులను పరిశీలించి మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు మాలోతు రావూజా, పొడియం వెంకటేశ్వర్లు, తేజావత్ జగ్గు, పులి వెంకటేశ్వర్లు, దుబ్బా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కొత్తగూడెంటౌన్: టిప్పర్ ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ మంగళగిరి శేషగిరి మంగళవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమవారం నాడు పెనగడప మెయిన్‌రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను పెనుబల్లి మండలానికి చెందిన కొప్పుల శ్రీకాంత్ బొగ్గు టిప్పర్‌తో ఢీకొట్టాడు. ఆటోలో ఉన్న శేషగిరి గాయపడటంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించగా.. మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య చందన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్క దాడిలో బాలుడికి గాయాలు

పినపాక: వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని వెంకటరావుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రమేశ్, వెన్నెల దంపతుల 11 నెలల సాత్విక్ ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసింది. వెంటనే తల్లిదండ్రులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆలయ సెక్యూరిటీ గార్డుపై ఫిర్యాదు

దుమ్ముగూడెం: పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న శేఖర్‌పై గ్రామస్తులు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. శేఖర్ మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఫోన్లు చేసి దుర్భాషలాడుతున్నాడని, మద్యం సేవించి ఆలయంలోకి వస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ద్రాక్షాయణి, మంగమ్మ, వరలక్ష్మి, లక్ష్మి, లీలావతి, ప్రత్యూష, జయ, ప్రణీత, నాగరాణి ఉన్నారు.

కేటీపీఎస్ ఏడీఈ భార్య ఆత్మహత్య

పాల్వంచ: కేటీపీఎస్ ఏడీఈ భార్య మానసిక రుగ్మతలతో బాధపడుతూ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. కేటీపీఎస్ ఏడీఈ వడ్డాది సుధాకర్‌కు విశాఖపట్నం గాజువాకకు చెందిన దీపికతో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 13 ఏళ్ల కూతురు ఉంది. కాగా దీపిక కొంతకాలంగా మానసిక రుగ్మతలతో బాధపడుతోంది. మంగళవారం గుమ్మానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనంతరం గుర్తించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతురాలి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీజీఎఫ్‌డీసీ ఉద్యోగులపై బదిలీ వేటు ?

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో పెంచుతున్న జామాయిల్ తోటల్లో కలప మాయం ఘటనలో ఆ శాఖ అధికారులపై బదిలీ వేటు పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మండలంలోని రంగాపురం శివారులో టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో 2006 నుంచి యూకలిప్టస్ (జామాయిల్) తోటలు సాగు చేస్తున్నారు. గత నెలాఖరులో 2–ఏ, 2–బీ పరిధిలో 500పైగా చెట్లు మాయం కాగా, ఆలస్యంగా కళ్లు తెరచిన స్థానిక అధికారులు ములకలపల్లిలోని ఓ ప్రైవేట్ అడ్తీలో కొంత కలపను స్వాధీనం చేసుకున్నారు. చెట్లు నరికిన వ్యక్తిపై నామమాత్రపు జరిమానా విధించారు. ఈ ఉదంతంపై ఈనెల 8న 'జామాయిల్ కలప మాయం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టి.. మూడు రోజుల అనంతరం నివేదిక సమర్పించారు. దీంతో పాల్వంచ డీఎం కవితను హైదరాబాద్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ములకలపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సునీతను రంగారెడ్డి డివిజన్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. వీరి స్థానంలో కొత్తగూడెం డీఎం చంద్రమోహన్‌ను పాల్వంచ ఇన్‌చార్జ్ డీఎంగా, సత్తుపల్లి పీఎం నాగరాజును ములకలపల్లి పీఎంగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. ఐతే ఈ విషయాన్ని ఉన్నతాధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

చెట్ల చోరీపై కేసు నమోదు..

జామాయిల్ చెట్ల చోరీపై మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.మధుప్రసాద్ వెల్లడించారు. ప్లాంటేషన్ మేనేజర్ సునీత పోలీస్ స్టేషన్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా.. చెట్లు నరికిన వ్యక్తి, అడ్తీకి సంబంధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

- వివాహితను మూడేళ్లుగా చిత్రహింసలు పెట్టినట్లు నిందితుల అంగీకారం
- వివరాలు వెల్లడించిన సీఐ నాగరాజురెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజురెడ్డి

అశ్వారావుపేట రూరల్: మూడేళ్లుగా తన భార్యకు భోజనం పెట్టకుండా చిత్రహింసలు పెట్టి హత్య చేసినట్లు ఆమె భర్త, అతడి సోదరి, తల్లి ఒప్పుకున్నారని, వారిని అరెస్ట్ చేశామని సీఐ పింగిళి నాగరాజురెడ్డి వెల్లడించారు. సంచలనం కలిగించిన వివాహిత మృతిని హత్యగా తేల్చిన పోలీసులు.. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన పూల లక్ష్మీప్రసన్న (33), భర్తతో కలిసి మూడేళ్లుగా అశ్వారావుపేటలోని కోనేరుబజార్‌లో భర్త అక్క ఇంట్లో ఉంటున్నారు. మూడు రోజుల క్రితం ఇంట్లో పనిచేస్తున్న క్రమంలో జారిపడిందని ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఈ నెల 24వ తేదీన లక్ష్మీప్రసన్న మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా, తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నట్లు తండ్రి ముదిగొండ వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేయగా లక్ష్మీప్రసన్న భర్త పూల నరేశ్‌బాబు, అతని తల్లి విజయలక్ష్మి, అక్క దాసరి భూలక్ష్మి, బావ దాసరి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. కాగా, తామే లక్ష్మీప్రసన్నకు మూడేళ్లుగా సరైన భోజనం పెట్టకుండా చిత్రహింసలు పెట్టి, కొట్టి హత్య చేశామని నిందితులు విచారణలో వెల్లడించారని సీఐ తెలిపారు. నరేశ్‌బాబు, విజయలక్ష్మి, భూలక్ష్మిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, దాసరి శ్రీనివాసరావు పరారీలో ఉన్నాడని, అతడి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. సమావేశంలో ఎస్ఐలు టి.యయాతిరాజు, రామ్మూర్తి, ట్రెయినీ ఎస్ఐ అఖిల, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫోర్జరీ కేసు కొట్టివేత

భద్రాచలంఅర్బన్: ఫోర్జరీ కేసును భద్రాచలం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కొట్టివేశారు. పట్టణానికి చెందిన పిలక లక్ష్మీమదన్‌రెడ్డి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న క్రమంలో తన సంతకాన్ని కొత్త రామస్వామి ఫోర్జరీ చేసి తన ఉద్యోగం పోయేలా చేశాడని ఆరోపిస్తూ 2007లో క్రిమినల్ కేసు దాఖలు చేశాడు. దాదాపు 16 ఏళ్ల పాటు ఈ కేసు విచారణ కొనసాగింది. సరైన సాక్ష్యాలు లేకపోవడంతో కొత్త రామస్వామిపై నమోదైన కేసును న్యాయమూర్తి మంగళవారం కొట్టివేశారు. రామస్వామి తరఫున న్యాయవాది ముత్యాల కిశోర్ వాదించారు.